ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



పార్వతీపురం మన్యం

జిల్లా వార్తలు

సోమవారం 1 డిసెంబరు 2025

బీజీలు ఇవ్వని మిల్లుల తొలగింపు

పార్వతీపురం, నవంబరు30(ఆంధ్రజ్యోతి): బ్యాంకు గ్యారెంటీ(బీజీ)లు ఇవ్వని ఐదు రైస్‌మిల్లులను సీఎంఆర్ ఆపరేషన్ల నుంచి తొలగిస్తున్నట్టు జిల్లా సివిల్ సప్లైస్ మేనేజర్ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బురద వెంకటాపురం, గడ్డ సింగుపురం, పిన్నింటి రామనాయుడువలస, గనసర, పెద్దూరు పరిధిలో మిల్లర్లు కనీసం బ్యాంకులను కూడా సంప్రదించలేదని పేర్కొన్నారు. సోమవారం లోగా బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వాలని తెలిపారు. లేకుంటే సీఎంఆర్ జాబితా నుంచి తొలగించి.. మిల్లర్లకు టార్గెట్స్ ఇవ్వబోమని స్పష్టం చేశారు.



శనివారం పర్యాటకులు లేక వెలవెలబోతున్న ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్

ఆ ఒక్కరోజే..!

- ఆదివారం కళకళ.. మిగతా రోజులు వెలవెల
- పర్యాటక ప్రదేశాలకు తగ్గుతున్న ఆదరణ
- సందర్శకులను ఆకర్షించని ఈవెంట్‌లు
- ధరల మోతతో బెంబేలు
- కొన్నేళ్లుగా పెరగని ఆదాయం
- ఆర్భాటాలతోనే సరిపెడుతున్న వైనం

సీతంపేట రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి)

సీతంపేట ఏజెన్సీలోని పర్యాటక ప్రాంతాలు వారంలో కేవలం ఆదివారం మాత్రమే రద్దీగా ఉంటున్నాయి. మిగిలిన రోజుల్లో వెలవెల బోతున్నాయి. పర్యాటక ప్రదేశాల్లో గతంలో ఏర్పాటు చేసిన ఈవెంట్‌లు పాత పడిపోవడం, కొత్తదనం లేకపోవడంతో ఈ ప్రదేశాలకు సందర్శకుల రద్దీ తగ్గుతూ వస్తోంది. కొద్ది రోజుల కిందట ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్, మెట్టుగూడ జలపాతం వద్ద సుందరీకరణ పనులు చేపట్టారు. పార్క్ లోపల భాగంలో రంగులు వేశారు. ఫొటోషూట్ పాయింట్‌లను ఏర్పాటు చేశారు. అయితే ఎంత చేసినా పర్యాటకుల నుంచి మాత్రం స్పందన రావడం లేదు. దీనిని అధిగమించేందుకు ఐటీడీఏ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. పిక్నిక్‌ల సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి చూసుకుంటే.. ఒక్క ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో పర్యాటకుల సందడి కనిపించడం లేదు. గత నెలలో ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్, మెట్టుగూడ జలపాతం నుంచి ఒక్క ఆదివారమే రూ.3.80లక్షలకు పైగా ఆదాయం వచ్చింది. మిగిలిన రోజుల్లో మాత్రం పర్యాటకుల తాకిడి లేక పెద్దగా ఆదాయం ఉండడం లేదు.



ఎన్టీఆర్ అడ్వంచర్‌పార్క్‌లో నిర్వాహకులు ఏర్పాటు చేసిన ఈవెంట్‌ల ధరల బోర్డు

ధరలు ఇలా..

- సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్, మెట్టుగూడ జలపాతం లోపల ఏర్పాటు చేసే ఈవెంట్‌ల ధరలపై పర్యాటకులు ఒకింత అసహనం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పార్క్‌లో లోపల భాగంలో వైవిధ్య విహార్(ఆల్‌టెర్రయిన్)ఈవెంట్‌లో వాహనం నడపాలంటే ఒక్కొక్కరికీ రూ.300, ఉయ్యాల విహార్ ఎక్కాలంటే రూ.200, హై సైకిల్‌కు రూ.100 వసూలు చేస్తున్నారు. మరికొన్ని చిన్నపాటి ఈవెంట్‌లలో సైతం అధిక మొత్తంలో వసూలు చేస్తుండడంపై సందర్శకులు బహిరంగంగా విమర్శలు గుప్పిస్తున్నారు.
- ఎన్టీఆర్ పార్కు, మెట్టుగూడ జలపాతం ప్రవేశ రుసుం గతంలో ఒక్కొక్కరికీ రూ.10 ఉండగా.. ఇటీవల రూ.30 వరకు పెంచారు. బైక్, కారు పార్కింగ్‌కు రూ.20, 50 చొప్పున వసూలు చేస్తున్నారు.
- గతనెల ఒకటో తేదీన పిక్నిక్ సీజన్ స్టార్ట్స్ పేరుతో రూ.లక్షలు వెచ్చించి అద్దె ప్రాతిపదికన పార్క్‌లోహాట్‌ఎయిర్ బెలూన్‌ను ఏర్పాటు చేశారు. అయితే ఒక్కొక్కరికీ రూ.1000వరకు ప్రకటించడంతో ఈ సాహసోపేతమైన (మిగతా 8వ పేజీలో..)



ఆదివారం మెట్టుగూడ జలపాతం వద్ద పర్యాటకులు ఇలా..



పి.కోనవలసలో గ్రామ సచివాలయం, రైతుసేవా కేంద్రాల భవనాలను ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

పాడి అభివృద్ధికి చర్యలు

- మంత్రి సంధ్యారాణి

పాచిపెంట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. పి.కోనవలసలో ఆదివారం 'రైతన్నా.. మీకోసం' ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 'పాడి అభివృద్ధిలో భాగంగా పాచిపెంట మండలానికి రెండు వందల గోకులాలు మంజూరు చేశాం. రైతులు ఎరువులు వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను వినియోగించాలి. ప్రతిఒక్కరూ అపరాలు సాగుపై దృష్టి సారించాలి. సాలూరు నియోజకవర్గానికి రూ. 20 కోట్లతో 40 హెల్త్ సెంటర్లు మంజూరు చేశాం. వీటిల్లో మక్కువ మండలానికి 9, పాచిపెంటకు 15, సాలూరుకు 16 భవనాలు చొప్పున మంజూరయ్యాయి. రాజకీయంగా ఎదుగుల, అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక కొందరు అసత్య ఆరోపణలు చేస్తున్నారు. టీడీపీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నంతవరకు నా ఎదుగుదలను ఎవరూ ఆపలేరు.' అని తెలిపారు. అనంతరం పి.కోనవలసలో గ్రామ సచివాలయం, రైతుసేవా కేంద్ర భవనాలను ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సాలూరు ఏఎంసీ చైర్మన్ ముఖి సూర్యనారాయణ, సాలూరు, పాచిపెంట, మక్కువ టీడీపీ నాయకులు యుగంధర్, తిరుపతిరావు, వేణుగోపాలరావు, పరమేశు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రాజకీయంగా ఎదుర్కోలేకే ఆరోపణలు

7లో

అవగాహనతోనే నియంత్రణ



- జిల్లాలో చాపకింద నీరులా హెచ్ఐవీ, ఎయిడ్స్
- నమోదవుతున్న కొత్త కేసులు
- అప్రమత్తత అవసరం
- నేడు ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం

పార్వతీపురం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): చాపకింద నీరులా జిల్లాలో హెచ్ఐవీ/ఎయిడ్స్ విస్తరిస్తోంది. అవగాహన లోపం, నిర్లక్ష్యం కారణంగా కొత్త కేసులు నమోదవుతున్నాయి. ఇదే సమయంలో కొందరు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. దీంతో వారి కుటుంబాలు సైతం వీధినపడుతున్నాయి. 2022-23తో పోలిస్తే 2024-25లో జిల్లాలో ఈ వ్యాధి తీవ్రత 0.34 శాతానికి తగ్గింది. కాగా 2025-26లో ఇప్పటి వరకు కేసుల నమోదు 0.39 శాతంగా ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. దీనిపై వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు అప్రమత్తం కావాల్సి ఉంది. స్వచ్ఛంద సేవా సంస్థలు కూడా తమవంతు కృషి చేయాల్సి ఉంది. కళాజాత, చైతన్య కార్య క్రమాలు నిర్వహించాల్సి ఉంది. సోమవారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' కథనం.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో 2022-2023లో 13,168 మంది పురుషులు, 12,390 మంది మహిళలు, 240 మంది ఇతరులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 105 మందికి హెచ్ఐవీ లక్షణాలు ఉన్నట్టు గుర్తించారు. అదే ఏడాదిలో 24,430 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించగా ఏడుగురికి వ్యాధి లక్షణాలు గుర్తించారు. 2023-24లో మొత్తంగా 28,730 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 137 మందికి హెచ్ఐవీ సోకినట్లు నిర్ధారించారు. అదే సంవత్సరంలో 22,582 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించగా అందులో ఏడుగురికి ఆ వ్యాధి లక్షణాలున్నట్లు గుర్తిం చారు. 2024-25లో 25,786 మందికి వైద్య పరీక్షలు నిర్వహించ గా వారిలో 87 మంది, 16,518 మంది గర్భిణులకు టెస్టులు చేయగా ఎనిమిది మంది ఆ వ్యాధి బారిన పడినట్లు నిర్ధారించారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 18,427 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో 35 మంది, 12516 గర్భిణుల్లో నలుగురికి హెచ్ఐవీ సోకినట్టు గుర్తించారు. జిల్లాలో ప్రస్తుతం 1608 మంది చికిత్స పొందుతున్నారు. దీనిపై జిల్లా ఎయిడ్స్, కుష్ఠు, టీబీ నివారణాధికారి ఎం.వినోద్ కుమార్‌ను వివరణ కోరగా.. 'జిల్లాలో హెచ్ఐవీ/ఎయిడ్స్‌ను పూర్తిస్థాయిలో నివారించడమే లక్ష్యంగా పని చేస్తున్నాం. అందుబాటులో ఉన్న వనరులను వినియోగిస్తూ ప్రతి వ్యక్తికి అవగాహన కల్పిస్తున్నాం. అందరికీ వైద్య పరీక్షలు చేస్తూ.. అవసరమైన వారికి వైద్య సేవలు అందిస్తున్నాం.' అని తెలిపారు.



పార్వతీపురం జిల్లా ఆసుపత్రిలో సేవలందిస్తున్న కేంద్రం

అందుబాటులో మందులు..

హెచ్ఐవీ, ఎయిడ్స్ తీవ్రతను తగ్గించే చాలా రకాల మందులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో సైతం అందుబాటులో ఉన్నాయి. 2008 నుంచి ఏఆర్‌టీ (యాంటీ రెట్రోవైరల్ థెరపీ ద్వారా)మందులు ఇస్తున్నారు. బాధితులకు నెలకు రూ.4వేలు చొప్పున పింఛన్ కూడా అందుతోంది. ఉమ్మడి జిల్లాలో రెండు ఏఆర్టీలు, ఎనిమిది లింకు కేంద్రాలు, 13 ఐసీటీసీ ల్యాబ్‌లు, 3 సుఖ వ్యాధి చికిత్స కేంద్రాలు పనిచేస్తున్నాయి. రెండు జిల్లాల్లో ప్రైవేటు, ప్రభుత్వ పరీక్ష కేంద్రాలు 100 వరకూ ఉన్నాయి. గతంలో మాదిరిగా ఎయిడ్స్‌పై చైతన్య కార్యక్రమాలు తగ్గుతుండడం మాత్రం ఆందోళన కలిగిస్తోంది. గతంలో వైద్య ఆరోగ్య శాఖతో పాటు స్వచ్ఛంద సంస్థలు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టేవి. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులూ ముందుకు వచ్చేవారు. కళాశాలలు, గిరిజన ప్రాంతాలు, మురికివాడలు, పల్లెలకు వెళ్లి చైతన్యపరిచేవారు. వారికి ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించడంతో ఆసక్తి ఉండేది. కానీ క్రమేపీ ప్రభుత్వాల ప్రోత్సాహాలు లేకపోవడంతో ఇటువంటి కార్యక్రమాలు తగ్గుముఖం పట్టాయి.

ముందే మేల్కొవాలి..

ముందే గుర్తించి మేల్కొంటే (మిగతా 8వ పేజీలో..)

తుఫాన్ టెన్షన్

- వాతావరణంలో మార్పులు.. రైతుల్లో గుబులు
- ధాన్యం నిల్వలను సంరక్షించే పనిలో నిమగ్నం
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వ్యవసాయ శాఖాధికారులు

పార్వతీపురం/పాలకొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ వార్తలతో జిల్లాలో అన్నదాతలు టెన్షన్ పడుతున్నారు. ధాన్యం నిల్వలను కాపాడుకోవడానికి అష్టకష్టాలు పడు తున్నారు. తుఫాన్ ప్రభావంతో ఆదివారం అర్ధరాత్రి నుంచి వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. దక్షిణ కోస్తాతో పోల్చుకుంటే ఉత్తర కోస్తాకు ప్రభావం చూపదని చెబుతున్నా.. గత అనుభవాల దృష్ట్యా రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే జిల్లాలో వాతావరణం మారింది. ఆకాశాన్ని కారు మబ్బులు కమ్మేశాయి. ఈ నేపథ్యంలో రైతులు కూలీల కొరతను అధిగమించి ధాన్యం నిల్వలను కల్లాలకు తరలించే పనిలో పడ్డారు. మరికొంతమంది పంట పొలాల్లోనే వరి పనాలను కుప్పలుగా వేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రెండు లక్షల ఎకరాలకు పైగా వరిని రైతులు సాగు చేశారు. ఇప్పటివరకు 70 శాతం వరకు కోతలు పూర్తయ్యాయి. వీటిలో 40 శాతానికి పైగా ధాన్యాన్ని కల్లాలకు తరలించారు. మిగిలిన 30 శాతం వరి పనాల రూపంలో పొలాల్లోనే ఉంది. వాస్తవంగా కోత కోసిన ఐదు రోజుల తర్వాత కుప్పలు వేసే అవకాశం ఉన్నప్పటికీ కూలీల కొరతతో ఆ పరిస్థితి లేకుండా పోయింది. ఇటువంటి సమయంలో అధిక వర్షం కురిస్తే అన్నదాతలకు నష్టం తప్పదు. ధాన్యం మొలకెత్తే అవకాశం ఉందని రైతులు వాపోతున్నారు. ● భామిని: వాతావరణం మార్పులతో భామిని మండలంలో రైతులు అప్రమత్తమయ్యారు. మొక్కజొన్న, పత్తి పంటలపై టార్పాలిన్లు కప్పి రక్షణ చర్యలు చేపట్టారు. మండలంలో పది వేల ఎకరాలు వరి సాగు చేయగా, కొన్ని చోట్ల కోతలను వాయిదా వేశారు. మరోవైపు జిల్లా వ్యవసాయశాఖ ముందస్తు చర్యలు చేపడుతోంది. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ఇప్పటికే 1500 టార్పాలిన్లు సిద్ధం చేసింది. అవసరమైన వారికి వాటిని అందించాలని జిల్లా వ్యవసాయాధికారి (డీఏవో) అన్నపూర్ణ తన సిబ్బందిని ఆదేశించారు. తుఫాన్ ప్రభావం జిల్లాపై ఉండదని అన్నారు. ఏదేమైనా వరి కోతలు నాలుగు రోజులు వాయిదా వేసుకోవడం మంచిదన్నారు.



పాలకొండలో వరి పనలను కుప్పలుగా వేస్తున్న రైతులు



ధాన్యంపై టార్పాలిన్ కప్పుతున్న రైతు

నత్తనడకన ధాన్యం కొనుగోలు..

జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు నత్తనడకన సాగుతున్నాయి. రైస్‌మిల్లర్లు పూర్తిస్థాయిలో బ్యాంకు గ్యారెంటీలు ఇవ్వకపోవడమే ఇందుకు కారణం. కాగా ఇప్పటికే రైతులు కల్లాల్లో ధాన్యం బస్తాలను సిద్ధం చేశారు. వర్షం కురిస్తే ఇవి కూడా పాడయ్యే అవకాశం ఉందని వారు ఆవేదన చెందుతున్నారు.

యథావిధిగానే పింఛన్లు

- కొనసాగుతున్న సదరం



గరుగుబిల్లి, నవంబరు30(ఆంధ్రజ్యోతి): జిల్లాలో లబ్ధిదారులందరికీ ఈనెలలో యాథావిధిగానే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందించనున్నారు. 15 మండలాలు, మూడు అర్బన్‌ల పరిధిలో 1,39,588 మందికి సోమవారం పింఛన్లు అందజేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వాటికి సంబంధించి రూ. 59.49 కోట్లు సచివాలయాలకు కేటాయించారు. ఇదిలా ఉండగా గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నకిలీ ధ్రువీకరణ పత్రాలతో దివ్యాంగ పింఛన్లు పొందిన వారికి రీవెరిఫికేషన్ కొనసాగుతోంది. జిల్లాలోని ప్రధాన ఆసుపత్రుల్లో చేపడుతున్న సదరం శిబిరానికి వారిని రిఫర్ చేశారు. పార్వతీపురం, కురుపాం, సీతంపేట, విజయనగరం, పాలకొండ, సాలూరు, తదితర ఆసుపత్రులకు సుమారు 1,863 మంది మొదటి విడతగా తనిఖీలకు హాజరయ్యారు. రెండో విడతలో మరో 611 మంది దివ్యాంగులకు ఆసుపత్రులకు వెళ్లనున్నారు. కాగా తనిఖీలు పూర్తి చేసుకున్న వారు సంబంధిత కార్యాలయాలకు ధ్రువీకరణ పత్రాలు పంపించలేదు. దీంతో ఈ నెలలోనూ లబ్ధిదారులందరికీ పింఛన్లు అందించనున్నారు. దీనిపై డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణిని వివరణ కోరగా.. ' జిల్లాలో దివ్యాంగ పింఛన్లు పొందుతున్న వారికి ఈ నెలలో యథావిధిగా పింఛన్ సొమ్ము అందుతుంది. కొందరు రీవెరిఫికేషన్‌కు వెళ్లారు.అయితే వీరి పూర్తి సమాచారం రావాల్సి ఉంది. ధ్రువీకరణ పత్రాలు, వైకల్య శాతం పునఃపరిశీలన కొనసాగుతుంది. పూర్తిస్థాయి నివేదికలు అందిన తదుపరే చర్యలు తీసుకుంటాం. పింఛన్ పొందుతూ మృతి చెందిన వారి కుటుంబాలకే ఈ నెలలో పింఛన్ మంజూరవుతుంది. నూతన పింఛన్లకు ఆదేశాలు రాలేదు.' అని తెలిపారు.

పీఎం ఆవాస్ యోజనకు

ముగిసిన గడువు

8లో

పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్స్‌లోకి

తోటపల్లి నీరు

- ప్రయాణికులకు తప్పని అవస్థలు

8లో

టీడీపీలో

250 కుటుంబాల చేరిక

7లో

కారు బోల్తా..

తప్పిన ప్రమాదం

- బీజేపీ జిల్లా అధ్యక్షుడికి స్వల్ప గాయాలు

8లో

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- నిబంధనల మేరకు ధాన్యం కొనుగోళ్లు
- ప్రభుత్వ విప్ జగదీశ్వరి

నేడు గీతా జయంతి వేడుకలు

- హాజరుకానున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా

8లో



గురజాడ అప్పారావుకి నివాళి అర్పిస్తున్న కలెక్టర్

గురజాడ ఆశయ సాధనకు కృషి

- కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి

బెలగాం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గురజాడ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురజాడ వర్ధంతి సందర్భంగా ఆదివారం పార్వతీపురం సబ్ కలెక్టరేట్ వద్ద ఆయన విగ్రహానికి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప సాహితీకారుల్లో గురజాడ అప్పారావు ఒకరిని కలెక్టర్ తెలిపారు. కన్యాశుల్కం నాటకంతో సమాజాన్ని మేల్కొలిపిన అభ్యు దయ కవితా పితామహుడు గురజాడ అని కొనియాడారు. తెలుగు భాష అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన వారిలో ఆయన ముఖ్యులని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వైశాలి, సాహితీ వేత్తలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తుఫాన్ హెచ్చరికలతో రైతుల్లో కలవరం



గోళ్లవలసలో వరి ఓవులు తిరగేస్తున్న రైతు

● పంట కోత, నూర్పు దశలో ఉండటంతో బెంబేలు

సంతకవిటి, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం వరి పంట కోత, నూర్పు దశలో ఉంది. ఇలాంటి సమయంతో తుఫాన్ కారణంగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు బెంబేలెత్తుతున్నారు. ముకుందపురం, పుల్లిట, ఎం.ఆర్ అగ్రహారం, గోళ్లవలస, తమరాం తదితర గ్రామాల్లో పైరు బాగా పండింది. చివరి దశలో వరి కోతలు అక్కడక్కడే జరుగుతున్నాయి. కోసిన పంట ఇంకా పొలాల్లోనే ఉంది. ఈ తరుణంలో వాతావరణం మారడంతో అన్నదాతలు కలవరపడుతున్నారు. భారీ వర్షం కురిస్తే పంట పీట పాలవుతుందని వారు తలలు పట్టుకుంటున్నారు. పంటను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఆపసోపాలు పడుతున్నారు. పనుల్లో బిజీగా ఉన్నారు.



యంత్ర సాయంతో నూర్పు చేస్తున్న రైతులు

టీడీపీలో 250 కుటుంబాల చేరిక



పార్టీలో చేరిన వారితో మంత్రి సంధ్యారాణి

మెంటాడ, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుర్ల, బడేవలస, జి.టి.పేటలకు చెందిన 250 కుటుంబాలు వైసీపీని వీడాయి. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి సమక్షంలో ఆదివారం వారు టీడీపీలో చేరారు. వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆమె సాదరంగా ఆహ్వానించారు. ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు మండల ప్రాదేశిక స్థానం గుర్లలో సింగంపల్లి అప్పలనాయుడు ఆధ్వర్యంలో 200 కుటుంబాలు, అలాగే బడేవలస, జి.టి.పేట గ్రామాలకు చెందిన సుమారు 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు చలుమూరి వెంకట్రావు, జి.అన్నవరం, సింగంపల్లి అప్పలనాయుడు, రెడ్డి ఆదినారాయణ, శరకాన రామునాయుడు, గొర్లె సన్యాసిరావు, అప్పికొండ సన్యాసిరావు, అప్పన్న, రెడ్డి ఎర్నాయుడు, గెడ్డ కాశీ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయంగా ఎదుర్కోలేకే ఆరోపణలు

మెంటాడ, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): రాజకీయంగా ఎదుర్కొనలేని కొందరు నాయకులు తనతో పాటు నా బిడ్డపైనా ఆరోపణలు చేస్తున్నారని రాష్ట్ర గిరిజన సంక్షేమ మంత్రి సంధ్యారాణి ఆవేదన వెలిబుచ్చారు. ఆదివారం గుర్ల గ్రామంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. వైసీపీ అనుకూల మీడియా కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వారి రాతలు, కూతలు మాత్రం తీవ్రంగా పరిగణిస్తానని సాక్షి పత్రిక, చానల్‌పై మండిపడ్డారు. ఎవరెన్ని కుట్రలు కుతంత్రాలకు పాల్పడినా ప్రజాభిమానమే తనకు రక్షా కవచమన్నారు. తన బిడ్డ తప్పు చేసినట్టు నిరూపిస్తే ఒప్పుకుంటానని, కాదని తేలితే తప్పుడు ఫిర్యాదు చేయించిన వారి సంగతి తేలుస్తానన్నారు. రాజకీయంగా ఎదుగుదల చూసి ఓర్వలేక తమ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకొని కుట్రలు పన్నుతున్నారని ఆమె అన్నారు. తన పీఏ, కుమారుడిపై వచ్చిన ఆరోపణలను నిగ్గుతేల్చాలని పోలీసులను కోరానని చెప్పారు.

బీజేపీకి ప్రాధాన్యమేదీ?

శృంగవరపుకోట, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): మిత్రపక్షమైన బీజేపీను స్థానిక టీడీపీ క్యాడర్‌తో పాటు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చొక్కాకుల అప్పారావు, సీనియర్ నేతలు సీహెచ్‌ఆర్‌కే ప్రసాద్, కొట్యాడ రామకోటి, జామి మండల అధ్యక్షురాలు రాయవరపు ఆదిలక్ష్మి ఆవేదన వెలిబుచ్చారు. ఆదివారం స్థానిక కల్యాణ మండపంలో బీజేపీ నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని మండల పార్టీ అధ్యక్షుడు మరిశ శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటై 18 నెలలు గడుస్తున్నా ఎటువంటి నామినేటెడ్ పదవులు, గ్రామాల్లో పనులు కేటాయింపులు లేవన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి వివరించి తదుపరి కార్యాచరణకు దిగుతామన్నారు. సమావేశంలో నాయకులు కోన మోహనరావు, లట్బాల పవన్‌కుమార్, శివకుమార్, బొండపల్లి చంద్రశేఖర్, సత్యనారాయణ, మహేష్, దేముడు ఉన్నారు.

టైలరింగ్ శిక్షణను వినియోగించుకోండి

గరివిడి, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): మహిళలు టైలరింగ్ శిక్షణను వినయోగించుకోవాలని బీసీ సెల్ ఆర్గనైజింగ్ రాష్ట్ర సెక్రటరీ వెన్నె సన్యాసినాయుడు అన్నారు. ఆదివారం గరివిడిలోని పాత వెంకటేశ్వర సిల్క్ ప్యాలెస్‌లో నిర్వహిస్తున్న ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు.కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చనమల మహేశ్వరరావు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుమలరాజు కిరణ్ కుమార్, సంచాన సన్యాసినాయుడు, సర్పంచ్ అప్పలనాయుడు పాల్గొన్నారు.

భగవద్గీత పఠనంతో జీవనసాఫల్యం

ఎస్.కోట రూరల్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): భగవద్గీత పఠనంతో జీవనసాఫల్యం సాధించవచ్చని విశ్వహిందూ పరిషత్ ఉత్తరాంధ్ర జిల్లాల కార్యదర్శి నాగభూషణం, జిల్లాశాఖ సభ్యుడు తిమిడి శ్రీరామ్, సీమ్ వ్యవస్థాపకుడు బొబ్బిలి రామకృష్ణ అన్నారు. ఆదివారం భర్తపురంలోని కల్యాణ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో భగవద్గీత సప్తాహ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ మండల కార్యదర్శి మామిడి సత్యనారాయణ, కె.జయవిష్ణు, ఎం.శ్రీనివాస రావు, శీనయ్య ఉన్నారు. అనంతరం భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు.

అధికారులు మోసం చేశారు..

ఎస్.కోట రూరల్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇచ్చిన అర్జీలను అధికారులు పరిశీలించకుండా మోసం చేశారని జిందాల్ నిర్వాసితులు వాపోయారు. బొడ్డవరలో నిర్వహిస్తున్న 170వ రోజు ఆదివారం నిరసన దీక్ష శిబిరంలో వారు మాట్లాడారు. కలెక్టరేట్, మండల స్థాయిలో పీజీఆర్‌ఎస్‌లో పలుమార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు స్పందించడం లేదన్నారు. సమస్యలు పరిష్కరించని పీజీఆర్‌ఎస్‌లు నిర్వహించడం తగదన్నారు. అర్జీలు సేకరించే అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే కష్టాలు తెలుస్తాయన్నారు.

టీడీపీ ఆత్మీయ సమావేశం రేపు

విజయనగరం రూరల్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నగర శాఖ ఆధ్వర్యంలో డిసెంబరు 2న జమ్ము నారాయణపురం రోడ్డులోని మారమ్మతల్లి ఆలయం ఎదుట తోటలో టీడీపీ నగర ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించనున్నట్టు ఆ పార్టీ అధ్యక్షుడు గంటా రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే అతిది గజపతిరాజుతో పాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారన్నారు.

పార్టీ కోసం పనిచేయండి

గుర్ల, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): ప్రతీ కార్యకర్త పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని టీడీపీ అబ్జర్వర్ గేదెల రాజారావు కోరారు. ఆదివారం తెట్టంగి, పల్లిగండ్రేడుల్లోని బూత్ కన్వీనర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో టీడీపీ బీసీ సెల్ ఆర్గనైజింగ్ రాష్ట్ర సెక్రటరీ వెన్నె సన్యాసినాయుడు, లక్ష్మనాయుడు, సూరినాయుడు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కొమరాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అంటివలస గ్రామంలో ఈ నెల 20న ప్రమాదవశాత్తూ కట్టెల పొయ్యి వద్ద జరిగిన అగ్ని ప్రమాదంలో గాయపడిన మండంగి పార్వతి విశాఖపట్నంలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. పుట్టింటిలో గాయపడిన పార్వతిని తొలుత జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ మృతి చెందడంతో ఆదివారం రామభద్రపురం గ్రామంలోని అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటనపై ఎస్ఐ నీలకంఠం కేసు నమోదు చేశారు.

భామినికి చెందిన వ్యక్తి..

భామిని, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): భామిని గ్రామానికి చెందిన బొమ్మాళి సుదర్శన (40) రోడ్డు ప్రమాదంలో గాయపడి విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం మేరకు.. సుదర్శన కుటుంబ సభ్యులతో కలిసి గురువారం శ్రీకాకుళం జిల్లాలోని హరిదాసుపురంలో అత్తవారింటికి బస్సులో బయలుదేరారు. వారంతా నందిగాం సమీపంలో ఎన్ఎన్‌పేట జంక్షన్‌లో దిగారు. అయితే సుదర్శన కుమార్తె రోడ్డు వైపు వెళుతుండటంతో పాపను తీసుకురావడానికి ఆయన వెళ్లారు. ఈక్రమంలో సుదర్శనను ఓ ద్విచక్ర వాహనం బలంగా ఢీకొట్టింది. దాంతో ఆయన అపస్మారకంలోకి వెళ్లిపోయారు. దాంతో అతడిని విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య సరస్వతి, కుమార్తె ఉన్నారు.

చీరకు నిప్పంటుకుని వృద్ధురాలి మృతి

బాడంగి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): చీరకు నిప్పంటుని వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలోని పెద్దవీధికి చెందిన మరడాన పాపమ్మ (76) శనివారం సాయంత్రం ఇంటిలో కర్రల పొయ్యి దగ్గర వంట చేస్తుండగా చీరకొంగు అంటుకుని గాయాలపాలైంది. గాయాలపాలైన ఆమె కుమారుడు మరడాన అప్పలనాయుడు స్థానిక సీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అనంతరం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అక్కడి చికిత్స పొందుతూ ఆదివారం పాపమ్మ మృతిచెందినట్టు తెలిపారు. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మృతురాలికి ఒక కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారని తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీ: వ్యక్తికి గాయాలు

రామభద్రపురం, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): తారాపురంలో ఆదివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అదే గ్రామానికి చెందిన పిల్లా రమణ తీవ్ర గాయాల పాలయ్యారు. రమణ పశువులను తోలుకుంటూ ఇంటికి వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. గాయపడిన రమణను బంధువులు సాలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విజయనగరం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి




మురుగునీటిని పరిశీలిస్తున్న కమిషనర్

రాజాం, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని గాయత్రి కాలనీలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపాల్ కమిషనర్ ఎ.రామచంద్రరావు హామీ ఇచ్చారు. ఆదివారం గాయత్రి కాలనీలో టీడీపీ నాయకులతో కలిసి ఆయన పర్యటించారు. ప్రధానంగా కాలువలు, సిమెంట్ రోడ్లు, విద్యుత్ స్తంభాలు, స్పీడ్ బ్రేకర్స్, తాగునీటి సమస్య, శ్మశానవాటిక వంటి సమస్యలు ఉన్నట్టు గుర్తించారు. అంతే కాకుండా కాలనీలో ఇళ్లకు పన్నులు కూడా వేయడం లేదని, దాని వల్ల కుళాయిలు వేయించుకోవడానికి ఇబ్బందులు కలుగుతున్నాయని వార్డు టీడీపీ నాయకులు ముగ శ్రీను, వంగవీటి కోటి, సరళ.. కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. కాలనీ వాసుల ఫిర్యాదు మేరకు వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు. అనంతరం శ్రీనివాస కాలనీ, మెహర్ బాబా కాలనీ, మల్లికార్జున కాలనీల్లో కమిషనర్ పర్యటించారు. ప్రజా సమస్యలను కమిషనర్ అడిగి తెలుసుకున్నారు.

మహాకవి గురజాడకు ఘన నివాళి

గుర్ల, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం మహాకవి గురజాడ వర్ధంతిని నిర్వహించారు. గురజాడ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. విజ్ఞాన కేంద్రం జిల్లా కన్వీనర్ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పశుగణాభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్ బెల్లాన బంగారునాయుడు హాజరయ్యారు. ముందుగా మహాకవి గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు సీహెచ్.రమేష్ మాట్లాడుతూ మూఢనమ్మకాలను కులమత బేధాలను నిరసిస్తూ గురజాడ చేసిన రచనలను వివరించారు. పాఠశాల నృత్య ఉపాధ్యాయని కనకమహాలక్ష్మి ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థినులు గురజాడ గేయాలకు నృత్య రూప ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో గోషాడ పాఠశాల హెచ్ఎం చందక అప్పలనాయుడు, ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరావు, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వక్తృత్వ పోటీల్లో లాస్యకు ప్రథమస్థానం



అవార్డు అందుకుంటున్న లాస్య

నెల్లిమర్ల, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత గురజాడ అప్పారావు వర్ధంతిని పురస్కరించుకుని గురజాడ సాంస్కృతిక సమాఖ్య జిల్లా స్థాయిలో నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో జరజాపుపేట ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ చాటారు. వక్తృత్వ పోటీలో ఎం.లాస్య ప్రథమ బహుమతి, వ్యాసరచనలో డి.తనుశ్రీ ప్రత్యేక బహుమతిని సాధించిందని హెచ్ఎం సుసర్ల కామేశ్వరి తెలిపారు. ఆనంద గజపతి ఆడిటోరియంలో నిర్వహించిన గురజాడ అప్పారావు వర్ధంతి కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్.మానవేంద్రనాథ్‌రాయ్, కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డి, ఎస్పీ దామోదర్‌రెడ్డి చేతుల మీదుగా లాస్య అవార్డు అందుకున్నారని తెలిపారు. బహుమతులు అందుకున్న విద్యార్థులను హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులుఅభినందించారు.

విద్యార్థులకు సుపథ పరీక్షలు

శృంగవరపుకోట, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం సుపథ పరీక్షలు నిర్వహించారు. 14 పాఠశాలల నుంచి 613 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పద్య పఠనం, శ్లోక పఠనం, దేశభక్తి గేయాలు, శ్రీకృష్ణ చరితామృతం వంటి వాటిపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సుపథ రూపకర్త యు.వి.ఎ.ఎన్.రాజు, విన్నకోట భాస్కరశర్మ, కె.సత్యనారాయణవిజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

పేద విద్యార్థినికి రూ.10వేల సాయం

గుర్ల, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): పోలయవలస గ్రామానికి చెందిన బీఎస్సీ నర్సింగ్ విద్యార్థిని గొంప సుధకు అదే గ్రామానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సేవాసంస్థ సభ్యులు ఆదివారం రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. విద్యార్థినికి పుస్తకాలు కూడా అందిస్తామని సభ్యులు తెలిపారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

దత్తిరాజేరు, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ముందుంటుందని రాష్ట్ర మంత్రి సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం విజయనగరంలోని తన కార్యాలయంలో మండలంలోని పప్పల లింగాలవలస గ్రామానికి చెందిన కడియాల ఉమకి రూ.77,801 సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, టీడీపీ నాయకులు ముకుందరావు తదితరులున్నారు.

శ్రీనివాసమూర్తి ఆదర్శప్రాయుడు

విజయనగరం కలెక్టరేట్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి డీఆర్‌వో శ్రీనివాసమూర్తి ఆదర్శప్రాయుడని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కొనియాడారు. డీఆర్‌వో ఉద్యోగ విరమణ నేపథ్యంలో ఆదివారం స్థానిక ప్రైవేట్ హోటల్‌లో జిల్లా అధికారుల అసోసియేషన్ జిల్లా రెవెన్యూ అసోసియేషన్ నిర్వహించిన కార్యక్రమంలో మంత్రితో పాటు కలెక్టర్ రామసుందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఏ సమస్యనైనా పరిష్కరించగల నేర్పరితనం శ్రీనివాసమూర్తి సొంతమన్నారు. ఆయనకు అనుభవనంతో బాటు గొప్ప నాయకత్వ లక్షణాలు ఉన్నాయని ప్రశంసించారు అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ శ్రీనివాసమూర్తి ఎంతో బాధ్యతాయుతంగా విధులు నిర్వహించారని కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ ఐఏఎస్ అధికారి కృష్ణయ్య , జేసీ సేతుమాధవన్, డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం



రైతులతో కలిసి పర్యటిస్తున్న ఎమ్మెల్యే అదితి

విజయనగరం రూరల్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అదితి గజపతి రాజు అన్నారు. ఆదివారం సాయంత్రం ఆమె మండలంలోని కోరుకొండపాలెంలో నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల కోసం చేపడుతున్న పలు సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. తాజాగా విడుదల చేసిన అన్నదాతా సుఖీభవ నిధులపై ఆరా తీశారు. ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నామన్నారు. రైతులు ప్రభుత్వ ప్రోత్సాహన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ కర్రోతు వెంకట నర్సింగరావు, వైఎస్ ఛైర్మన్ చంద్రినాయుడు, టీడీపీ నాయకులు గంటా పోలినాయుడు, పాసి అప్పలనాయుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నాయుడు పాల్గొన్నారు.

సందడిగా వన సమారాధన



పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సువర్ణరేఖ

శృంగవరపు కోట, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): స్థానిక పుణ్యగిరి రోడ్డులో ఆదివారం వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వన సమారాధన సందడిగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమర యోధుడు గొర్రిపాటి బుచ్చి అప్పారావు చిత్రపటానికి ఆమెతో పాటు పీఎసీఎస్ ఛైర్మన్ జీఎస్ నాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు డోకుల అచ్చెంనాయుడు, పోతల వెంకటరమణ తదితులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాటిపూడి జలాశయానికి జి.బి.అప్పారావు జలాశయంగా నామకరణం చేసే విషయం శాసనసభలో ప్రస్తావించడంపై ఎమ్మెల్యేను వెలమ సంక్షేమ సంఘం కృతజ్ఞతలు తెలిపింది. ఈ సందర్భంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పెట్రోలియం అండ్ ఎనర్జీ వర్సిటీ అసోసియేట్ ప్రొ.డాక్టర్ రంధి రామునాయుడు, స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్ సువర్ణ రేఖ, జనరల్ ఫిజిషియన్ డా. కె.రామమూర్తి, నేత్ర వైద్యుడు జీవీకే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



ట్రోఫీ అందజేస్తున్న ఎంఈవో

నెల్లిమర్ల, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయని ఎంఈవో సూర్యనారాయణమూర్తి అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేటకు చెందిన గాంధీరామ్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు మద్దిల సన్యాసిరావు ఆధ్వర్యంలో నెల్లిమర్ల ఫుట్‌బాల్ మైదానంలో ఆదివారం నెల్లిమర్ల, గుర్ల మండలాలకు చెందిన ఉపాధ్యాయులకు క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. నెల్లిమర్ల మండల ఉపాధ్యాయుల జట్టుకు పిన్నింటి వాసు, గుర్ల మండల జట్టుకు హరి మోహన్ కెప్టెన్లుగా వ్యవహరించారు.ఈ పోటీల్లో నెల్లిమర్ల జట్టు విజేతగా నిలిచింది. నెల్లిమర్ల జట్టు క్రీడాకారుడు ఎన్.కిరణ్ ఉత్తమ బ్యాట్స్‌మెన్‌గా, గుర్ల మండల జట్టు నుంచి హరిమోహన్ బెస్ట్‌బౌలర్‌గా ఎంపికయ్యారు. నెల్లిమర్ల క్రీడాకారుడు పిన్నింటి వాసు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందుకున్నారు. క్రీడాకారులకు ట్రోఫీ, మెడల్స్‌ను ఎంఈవో ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో ఎం.శ్రీనివాసరావు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎం సీహెచ్.ఆనందమూర్తి పాల్గొన్నారు. మ్యాచ్ రిఫరీలుగా ఆరిపాక బాబు విశ్వేశ్వరరావు, హరి శ్రీను, స్కోరర్‌గా కడలి సత్యసాయి గణేష్ వ్యవహరించారు.

జనసేనను బలోపేతం చేయండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగమాధవి

నెల్లిమర్ల, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ పటిష్టతకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి పిలుపునిచ్చారు. నెల్లిమర్ల సమీపంలోని అటవీశాఖ నగర వనం పార్కులో ఆదివారం నియోజకవర్గస్థాయి జనసేన పార్టీ వన సమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే లోకం నాగమాధవి, లోకం ప్రసాద్ దంపతులతో పాటు నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతో సందడిగా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లోకం నాగమాధవి మాట్లాడుతూ జనసేన పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి పార్టీ నాయకులు, కార్యకర్తలు ముందుకు వెళ్లాలన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. గ్రామాల్లో పార్టీ బలోపేతానికి అడుగులు వేయాలన్నారు. ఈ సందర్భంగా పార్టీలో కీలకంగా పనిచేస్తున్న పలువురు నాయకులను సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు చనమల్ల వెంకటరమణ, అవనాపు విక్రమ్, కరుమజి గోవిందరావు, కోట్ల రఘు, రవ్వా నాని, అంబల్ల అప్పలనాయుడు, ఎడ్ల గోవిందరావు, ఎంఎం.నాయుడు, పతివాడ గోవిందరావు, తుమ్ము వెంకటరమణ, జనా ప్రసాద్, గంటా సతీష్, అప్పికొండ రవికుమార్, బంటుపల్లి వాసుదేవరావు, పాలు శ్రీను, బాల అప్పలరాజు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి డీఆర్‌వోగా మురళి

విజయనగరం కలెక్టరేట్, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): ఇన్‌చార్జి డీఆర్‌వోగా కేఆర్‌ఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ మురళిని నియమిస్తూ కలెక్టర్ రామసుందర్ రెడ్డి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. డీఆర్‌వో శ్రీనివాసమూర్తి ఉద్యోగ విరమణ చేయడంతో ఆ బాధ్యతలను మురళికి కలెక్టర్ అప్పగించారు.

ఘనంగా మందిరం వార్షికోత్సవం

గజపతినగరం, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): ఎం.కొత్తవలసలో ఆదివారం సత్యసాయిబాబా మందిరం వార్షికోత్సవాన్ని కమిటీ ప్రతినిధులు, గ్రామపెద్దలు, ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబాకు ప్రత్యేక పూజలు చేపట్టారు. చిన్నారుల కోలాటాల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

బూడిపేటలో సేవా కార్యక్రమాలు

గజపతినగరం, నవబంరు30 (ఆంధ్రజ్యోతి): బూడిపేట, దావాలపేట గ్రామాల్లో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సేవా కార్యక్రమాలను ఆదివారం నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రమశిక్షణ, సేవాభావం, నాయకత్వ నైపుణ్యాలు పెంపొందించేందుకు ఇలాంటి శిబిరాలు ఎంతో దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా వరద తిరుపతిరావు, సర్పంచ్ బూడి జ్యోతి పాల్గొన్నరు.

నేడు యువతతో మంత్రి సమావేశం

గజపతినగరం, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): ఐటీఐ విద్యను అభ్యసించిన యువతీ, యువకులతో సోమవారం రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమావేశం కానున్నట్లు మండల పార్టీ అధ్యక్షులు గంట్యాడ శ్రీదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గం పరిధి లోని గజపతినగరం, దత్తిరాజేరు, బొండపల్లి, గంట్యాడ, జామి మండలాలకు చెందిన యువతతో స్థానిక పార్టీ కార్యాలయంలో సమావేశం కానున్నారన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఆపండి

విజయనగరం దాసన్నపేట, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): వైద్య కళాశాల ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నాగభూషణం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆదివారం నగరంలోని దాసరి నాగభూషణం భవనంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అందరికీ కల్పించాలన్నారు. రాష్ట్రంలో యూనివర్సిటీలకు నిధులు తెస్తామని, జీవోలు 107, 108 లను రద్దు చేసి వైద్య విద్యను ప్రభుత్వపరం చేస్తామని చెప్పిన పాలకులు ఆ మాటను విస్మరించడం తగదన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సుమన్, గౌరీశంకర్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

విజయనగరం దాసన్నపేట, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): విశాఖలో డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకూ తలపెట్టిన అఖిల భారత మహాసభలను అందరూ విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.వి.రమణ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఐటీయూ 1970 ఏర్పడిందని, నాటి నుంచి నేటి వరకూ కార్మికవర్గ ఐక్యత, ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ, దేశ సమైక్యతకు కట్టుబడి పనిచేస్తోందన్నారు. కోటి మంది కార్మికులకు ప్రాతినిధ్యం వహించే సీఐటీయూ అఖిల భారత మహాసభలకు దేశవ్యాప్తంగా 200 మంది ప్రతినిధులు ఆరు దేశాల నుంచి హాజరుకానున్నారన్నారు. ఈ సందర్భంగా మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. సమావేశంలో నగర ఉపాధ్యక్షుడు రెడ్డి శంకరరావు, ఎ.జగన్మోహన్ రావు, బి.రమణ, మహాలక్ష్మి, సునీత పాల్గొన్నారు.

ఆ ఒక్కరోజే..!

(ఐదో పేజీ తరువాయి)

హాట్‌ఎయిర్ బెలూన్ ఎక్కేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. దీంతో ఈవెంట్ నిర్వాహకులు రెండు రోజుల్లోనే హాట్‌ఎయిర్ బెలూన్‌ను ఇక్కడ నుంచి తీసుకెళ్లిపోయారు. కాగా వీరికి ఐటీడీఏ కొంత మొత్తం అద్దెను చెల్లించినట్లు తెలిసింది.

● ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌లో ఏయే ఈవెంట్‌లు ఏర్పాటు చేస్తారనే దానిపై ఐటీడీఏ అధికారులు పంపిన డీపీఆర్(డిటైల్ ప్రాజెక్ట్ రిపోర్ట్)కు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నిధులు విడుదలైన వెంటనే టెండర్లు నిర్వహించి పనులు ప్రారంభించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు.

ఆదాయాన్ని సక్రమంగా వినియోగించక..

పర్యాటక ప్రాంతాల నుంచి వచ్చే ఆదాయాన్ని ఐటీడీఏ అధికారులు సక్రమంగా వినియోగంచ లేకపోతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆయా చోట్ల పనిచేస్తున్న గిరిజన నిరుద్యోగ యువతకు జీతాల చెల్లింపులు మినహా మిగతా ఆదాయం పర్యాటక ప్రదేశాల అభివృద్ధికి విని యోగించడం లేదనే ఆరోపణలున్నాయి. ఈ పర్యాటక ప్రదేశాలపై ఐటీడీఏ అధికారుల పర్యవేక్షణ కొరవడింది. ఏదేమైనా ఆర్భాటాలకే లక్షల్లో ఖర్చులు చేస్తున్నారు తప్పా పర్యాటక ప్రదేశాల అభి వృద్ధిపై ఐటీడీఏ అధికారులు దృష్టిసారించడం లేదని గిరిజన సంఘాల నాయకులు ఆరోపి స్తున్నాయి. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఏపీవో ఏమన్నారంటే..

'సీతంపేట ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌లో కొత్త హంగులు ఏర్పాటు, గిరిజన మ్యూజియం పనుల పూర్తికి గాను ప్రభుత్వానికి పంపిన డీపీఆర్‌కు అనుమతులు వచ్చాయి. నిధులు విడుదలైతే పార్క్‌లో కొత్త ఈవెంట్‌లు ఏర్పాటు చేస్తాం. మ్యూజియం పనులు కూడా పూర్తవు తాయి. ఇక పార్క్‌లో నిర్వహించే ఈవెంట్‌ల ధరలపై ఎటువంటి మార్పులు చేయలేదు. ఒక్క వెహికిల్ పార్కింగ్ రుసుమును మాత్రమే పెంచాం.' అని ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు తెలిపారు.

అవగాహనతోనే నియంత్రణ

(ఐదో పేజీ తరువాయి)

ప్రాణాపాయం తప్పించుకోవచ్చు. హెచ్ఐవీని నియంత్రించే చాలారకాల మందులు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుతం మద్యం మత్తులో యువత చిత్తు అవుతోంది. ఈ క్రమంలో తప్పటడుగులు పడుతున్నాయి. గిరిజన తాండాల్లో అవగాహన లేకపోవడం, బాధితులపై పర్యవేక్షణ కరువవ్వడం, కేసుల గుర్తింపులో జాప్యం తదితర కారణాలతో ఎక్కువ మంది ఆస్పత్రిపాలవుతున్నారు. ఎయిడ్స్ ప్రాణాంతకమైనప్పటికీ మందులు వాడితే కొంత కాలం ప్రాణాలు నిలపవచ్చు. కానీ అవగాహన లేకపోవడమే ప్రధాన సమస్య. హెచ్ఐవీ పరీక్ష కేంద్రాలు జిల్లా వ్యాప్తంగా ఉన్నాయి. అక్కడే రక్తనమూనాలు సేకరించి గంటలోపే ఫలితం వెల్లడిస్తారు. అన్ని అంశాలపై అవగాహన కల్పిస్తారు. కానీ కొందరు రకరకాల అనుమానాలతో అక్కడకు వెళ్లడం లేదు

ఎయిడ్స్ రహిత సమాజం అందరి బాధ్యత..

ఎయిడ్స్ రహిత సమాజం అందరి బాధ్యత అని డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్ఐవీపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. హెచ్ఐవీ వ్యాధిగ్రస్థులకు ప్రభుత్వం ఉచితంగా మందులు అందిస్తుందని పేర్కొన్నారు. వాటితో పాటు పౌష్టికాహారం తీసుకుంటే జీవన ప్రమాణం మెరుగుపడుతుందని వెల్లడించారు. జిల్లాలో ఏఆర్‌టీ సెంటర్లు, ఐసీటీఎస్ కేంద్రాలు, ఆసుపత్రుల్లో హెచ్ఐవీ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నా మన్నారు. ఆయన వెంట ఆరోగ్యశాఖ ప్రోగ్రాం అధికారులు జగన్మోహన్‌రావు, వినోద్‌కుమార్, పి.ఎల్.రఘుకుమార్ ఉన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన



శక్తియాప్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పాలకొండ, నవంబరు30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పోస్టుమెట్రిక్ బాలికలు, బాలుర హాస్టళ్లలో ఆదివారం శక్తి బృందం ఆ యాప్‌పై అవగాహన కల్పించింది. విద్యార్థినులంతా శక్తియాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఆపద సమయంలో ఇది ఎంతగానో సహాయపడుతుందన్నారు. అనంతరం గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై వివరించారు. శక్తి బృందం జిఝాన్సీ, బి.శోభోరాణి, ఎ.రాము తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్ఐ కళాధర్

వీరఘట్టం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ జి.కళాధర్ సూచించారు. ఆదివారం బిటివాడ గ్రామంలో ప్రజలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. చట్టాలపై అవగాహనతోనే మోసాలను అరికట్టొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన అవసరం

భామిని, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రతి పౌరుడికి సాధారణంగా హక్కులు ఉంటాయిని, దానిని వినియోగించుకోవాలని బత్తిలి ఎస్ఐ జి.అప్పారావు కోరారు. ఆదివారం పాలవలస ఆదివాసీ గిరిజన గ్రామంలో పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు పౌర హక్కులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ మణి ప్రభాకర్, గ్రామస్థులు పాల్గొన్నారు.



గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

గిరిజన పంచాయతీలను ఏర్పాటు చేయాలి

బొబ్బిలి రూరల్, నవంబరు30(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మండలంలో ఉన్న గిరిజన గ్రామాలన్నీ కలిపి పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.శంకరరావు డిమాండ్ చేశారు. మోసూరువలస, ఎరకొండరవలస, డొంగురువలస, చిలకమ్మ వలస, సియోనువలస తదితర గిరిజన గ్రామాల్లో ఆదివారం పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గిరిజనులకు ప్రత్యేకమైన పంచాయతీలు లేనందున ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు సక్రమంగా అందడం లేదన్నారు. వారి అవసరాలకు అనుగుణంగా తీర్మానాలు జరగడం లేదని చెప్పారు. సుమారు 16 గిరిజన గ్రామాలను జనాభా ప్రాతిపదికన రెండు పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని కోరారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

● నిబంధనల మేరకు ధాన్యం కొనుగోళ్లు

● ప్రభుత్వ విప్ జగదీశ్వరి

జియ్యమ్మవలస, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): కురుపాం నియోజకవర్గంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆదేశించారు. ఆదివారం కేటీ వాడ పంచాయతీలో 'అన్నదాత సుఖీభవ' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఖరీఫ్ రైతుల నుంచి పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తామ న్నారు. సకాలంలో అన్నదాతల ఖాతాల్లో డబ్బులు జమయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎరువుల వాడకం తగ్గించాలని సూచించారు. ప్రతిఒక్కరూ ప్రకృతి సాగు వైపు దృష్టి సారించి తద్వారా మంచి పౌష్టికాహారాన్ని అందించాలని పిలుపునిచ్చారు. 'అన్నదాత సుఖీభవ' నిధులు జమ కాని రైతులను గుర్తించి జాబితాను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. నిబంధనల ప్రకారం ధాన్యం కొనుగోలు చేపట్టాలని, ఎటువంటి అక్రమాలు జరగడానికి వీల్లేదని తెలిపారు. రైతులకు కష్టం రానీయకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో ఆర్. విజయభారతి, కన్వీనర్ జోగి భుజంగరావు, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి లక్ష్మణరావు, అరకు పార్లమెంటు అధికార ప్రతినిధి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కేటీ వాడలో రైతు సమస్యలు తెలుసుకుంటున్న విప్ జగదీశ్వరి

నేడు గీతా జయంతి వేడుకలు

● హాజరుకానున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా

బెలగాం, నవంబరు30(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం రైతు బజార్ సమీపంలో సోమవారం గీతా జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు గోపాలకృష్ణ యాదవ సంఘం నిర్వాహకులు మంచిపల్లి శ్రీరాములు తెలియజేశారు. ఆదివారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ.. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, ఎమ్మెల్యే విజయ చంద్ర హాజరవుతారని చెప్పారు. భారీ అన్నదానం కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. రాధాకృష్ణ విగ్రహాల ఊరేగింపు కూడా ఉంటుందన్నారు.

రబ్బర్ డ్యామ్ వద్ద పోలీసుల పర్యవేక్షణ

కొమరాడ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): రాజ్యలక్ష్మీపురం పరిధిలో జంఝావతి నదిపై ఉన్న రబ్బర్ డ్యామ్ వద్ద ఆదివారం పోలీసులు పహారా కాశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. జాగ్రత్తలు తీసుకోవాలని పర్యాటకులకు సూచించారు.

రోడ్ల నిర్మాణం కోసం సర్వే

కొమరాడ, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో గిరి శిఖర గ్రామాలైన రెబ్బ, వనదార గ్రామాలకు రోడ్లు మంజూరయ్యాయి. ఈ మేరకు ఆదివారం ఆయా ప్రాంతాల్లో భూ సర్వే చేపట్టారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని ఐటీడీఏ ఏఈ గౌరునాయుడు తెలిపారు.



రోడ్డు నిర్మాణం కోసం సర్వే చేస్తున్న సిబ్బంది

ఆర్టీసీ కాంప్లెక్స్‌లోకి తోటపల్లి నీరు



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిలిచిన తోటపల్లి నీరు

పాలకొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్‌గేటులోకి ఆదివారం తోటపల్లి నీరు చేరింది. దీంతో ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రస్తుతం రైతులకు సాగునీరు అవసరం లేదు. అయినప్పటికీ సంబంధిత శాఖాధికారులు తోటపల్లి ఎడమ ప్రధాన కాలువ నుంచి నీరు విడుదల చేస్తున్నారు. అయితే ఇది వడమ నుంచి పలు కాలనీల మీదుగా రహదారులు పక్కనే ఉన్న మురుగుకాలువల్లోకి చేరుతుంది. అయితే మురుగుకాలువలు చెత్తాచెదారాలు నిండిపోవడంతో ఆ నీరు ప్రధాన రహదారులపైకి వచ్చి చేరుతుంది. గత కొన్ని రోజులుగా పట్టణంలోకి పలు కాలనీ వాసులు ఇబ్బందులు పడతుండగా.. తాజాగా తోటపల్లి సాగునీరు ఆర్టీసీ కాంప్లెక్స్‌లోకి చేరింది. మొత్తంగా సాగునీరు వృథా అవుతుండడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు స్పందిచాలని స్థానికులు కోరుతున్నారు.

24 గంటల్లోనే ధాన్యం నగదు జమ

గరుగుబిల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన 24 గంటల్లోనే.. నగదు జమ కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని మండల పరిషత్ అధ్యక్షులు ఉరిటి రామారావు తెలిపారు. ఆదివారం మరుపెంటలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా ధాన్యం విక్రయించిన ఒకట్రెండు రోజుల్లో బ్యాంకు అకౌంట్లలో నగదు జమవుతుందన్నారు. దీంతో రైతుల కుటుంబాల్లో పండగ వాతావరణం నెలకొందన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా ధాన్యం తరలించడం జరుగుతుందని తెలిపారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారన్నారు.

గిరిజనులకు సేవ చేయాలి

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఎస్టీ కమిషన్ మెంబర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన కద్రక మల్లేశ్వరరావు గిరిజనులకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని గిరిజన సంఘాల నాయకులు కోరారు. ఆదివారం ఆయన్ని మండల కేంద్రంలో సన్మానించారు. ఇటీవలే విజయవాడలో ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత మల్లేశ్వరరావు మొదటిసారిగా గుమ్మలక్ష్మీపురం వచ్చిన సందర్భంగా పలువురు ఆయన్ని కలిశారు. తహసీల్దార్ నిమ్మక శేఖరం, ట్రైబల్ రైట్స్‌ఫోరం రాష్ట్ర, జిల్లా అధ్యక్షులు రొబ్బా లోవరాజు, ఇంటికుప్పల రామకృష్ణారావు, నియోజకవర్గం ఎస్టీ సెల్ అధ్యక్షుడు మండంగి భూషణరావు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ పరీక్షకు 224 మంది హాజరు

వీరఘట్టం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): వీరఘట్టంలోని ఓ కాలేజ్‌లో ఆదివారం నిర్వహించిన జవహర్ నవోదయ మెగా మెడికల్ పరీక్షకు 224 మంది విద్యార్థులు హాజరయ్యారు. మొదటి 20 స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందజేశారు.

ఆవాస్ యోజనకు ముగిసిన గడువు

గరుగుబిల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస్ గ్రామీణ యోజన పథకానికి ఆదివారంతో గడువు ముగిసింది. 15 మండలాల పరిధిలో 28,533 మంది గృహ నిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కాగా గ్రామీణ ప్రాంతాల్లో నివాస స్థలం ఉన్నా, లేకపోయినా ఇళ్ల నిర్మాణాలకు ప్రత్యేక సర్వేను నిర్వహించారు. ముందుగా గ్రామస్థాయిలో నివాసాలకు సర్వే చేప ట్టారు. ఆ తర్వాత లబ్ధిదారునికి జియోట్యాగింగ్ నిర్వహించారు. దీనిపై గృహ నిర్మాణ శాఖ ఈఈ వై.సోమేశ్వరరావును వివరణ కోరగా.. ' గత నెల రోజులుగా గ్రామాలవారీగా పీఎం ఆవాస్ యోజన పథకానికి అర్హులైన వారి వివరాలు సేకరించాం. వాటి వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చాం. ప్రత్యేక బృందాలు గ్రామస్థాయిలో సర్వే నిర్వహించి నివేదికలు అందించారు. వాటిని ఉన్నతాధికారులకు పంపిస్తాం. తదుపరి ఆదేశాల మేరకు పంచాయతీలవారీగా జాబితాలు విడుదల చేస్తాం. గృహ నిర్మాణాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా నిధులు కేటాయిస్తాయి. ' అని తెలిపారు.



చినగుడబలో లబ్ధిదారుల వివరాలు సేకరిస్తున్న హౌసింగ్ అధికారులు

యాజమాన్య పద్ధతులు పాటించాలి



సుంకిలో అవగాహన కల్పిస్తున్న ఉద్యాన కళాశాల కార్యాలయ అధికారి దీప్తి

గరుగుబిల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని రైతులు యాజమాన్య పద్ధతులు విధిగా పాటిస్తే అధిక దిగుబడులు పొందొచ్చని వైఎస్ఆర్ ఉద్యాన కళాశాల కార్యాలయ అధికారి వి.దీప్తి తెలిపారు. ఆదివారం సుంకి పంచాయతీలో మొక్కలు నాటడం, పరిసరాలు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారితతో సాగు చేస్తే వ్యయం తగ్గుతుందన్నారు. రసాయనిక ఎరువుల వినియోగానికి దూరంగా ఉండి అందుబాటులో లభించే సేంద్రియ ఎరువులను ఉపయోగించాలని సూచించారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను చేసుకోవాలన్నారు. గ్రామాల్లో వయ్యారిభామ కలుపు మొక్కతో దుష్ప్రభావాలు నెలకొంటాయన్నారు. చర్మ వ్యాధులు, శ్వాస కోశ వ్యాధులు, కంటి సమస్యలతో పాటు పలు సమస్యలు ఎదురవుతాయని తెలిపారు. సర్పంచ్ కె.రవీంద్ర, అధ్యాపకులు ఆర్.పూర్ణ, చైతన్య, ఎస్.ఝాన్సీరాణి, సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా పారాది కాజ్‌వే పనులు

బొబ్బిలి రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పారాది వద్ద వేగావతి నదిపై చేపడుతున్న కాజ్‌వే మరమ్మతుల పనులు చురుగ్గా జరుగుతున్నాయి. మరో వారం రోజుల్లో అందుబాటులోకి రానుంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కాజ్‌వే పూర్తిగా దెబ్బతింది. దీంతో వాహనాలు, ప్రజల రాకపోకలను అధికారులు నిలిపివేశారు. కాజ్‌వే మరమ్మతుల కోసం కలెక్టర్ రూ.15 లక్షలు మంజూరు చేశారు. ఈ మేరకు కాంట్రాక్టరు పనులను వేగవంతం చేస్తున్నారు. ప్రస్తుతం కాజ్‌వే లేకపోవడంతో అటుగా వెళ్లే భారీ వాహనాలను బొబ్బిలి నుంచి అలజంగి-తెర్లాం రహదారి వైపు మళ్లిస్తున్నారు. దీంతో గొల్లపల్లి, అలజంగి, కారాడ రోడ్లు ఛిద్రమవుతున్నాయి. కాగా మరో వారం రోజుల్లో కాజ్‌వే మరమ్మతు పనులు పూర్తవుతాయని ఆర్‌బీ ఏఈ రాజు తెలిపారు.

నిబంధనల మేరకే ధాన్యం సేకరించాలి

● ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అప్పలనాయుడు

పాలకొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ సీజన్ ధాన్యం విక్రయాలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ నిబంధనల మేరకే ధాన్యం సేకరణ చేపట్టాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బుడితి అప్పలనాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేఖర్లతో మాట్లాడారు. మిల్లర్లు దోపిడీని అధికారులు నియంత్రించాలన్నారు. జిల్లాలో ఉన్న మిల్లర్లంతా రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. క్వింటాకు ఐదు కేజీల అదనంగా దింపుడు కూలి కావాలని పేచిపెడుతున్నారని తెలిపారు. ఈ విధంగా రైతులను ఇబ్బందులు గురిచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీనిపై అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని డిమాండ్ చేశారు. రైతులకు న్యాయం చేసి భరోసా కల్పించాలని కోరారు. అన్నదాతలు కూడా మిల్లర్లు దోపిడీకి వ్యతిరేకంగా నిలబడాలని సూచించారు. ప్రభుత్వ మద్దతు ధర సాధించుకోవాలన్నారు.

ప్రారంభానికి సిద్ధమైన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న ఆయుష్మాన్ మందిర్

పాలకొండ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీ పరిధిలో నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ అర్బన్ హెల్త్ సెంటర్ ఎట్టకేలకు ప్రారంభానికి సిద్ధమైంది. గత వైసీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పనులు మందకొడిగా సాగాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పనులను వేగవంతం చేసింది. సుమారు రూ.80 లక్షలతో నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన సమీక్షలో ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఈ భవనంపై ఆరా తీశారు. నిర్మాణం పూర్తయిందని, డ్రైన్ ఏర్పాటుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని అధికారులు చెప్పారు. అయితే దీనికి త్వరితగతిన పరిష్కారం చూపిస్తామని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో భవనాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపడుతున్నారు. గత కొన్నేళ్లుగా సొంత భవనం లేక అద్దె కొంపల్లోనే అర్బన్ హెల్త్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. అన్ని హంగులతో నూతన భవనం అందుబాటులోకి వస్తే.. అటు, వైద్య సిబ్బంది, ఇటు రోగులకు ఇక్కట్లు తప్పుతాయి.

అటవీ ఉత్పత్తుల కొనుగోలు



బీరుపాడులో అటవీ ఉత్పత్తులు కొనుగోలు చేస్తున్న జీసీసీ సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో బీరుపాడు, కున్తేషు సమీప గిరిజన గ్రామాల్లో ఆదివారం జీసీసీ సిబ్బంది అటవీ ఫలసాయాలను కొనుగోలు చేశారు. గిరిజన రైతుల నుంచి కరక్కాయలు 702 కేజీలు, ముసిడిక పిక్కలు 88 కేజీలను క్రయం చేశారు. ఈ సందర్భంగా పార్వతీపురం జీసీసీ డివిజనల్ మేనేజర్ రామారావు మాట్లా డుతూ.. జీసీసీ ద్వారా గిరిజన రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ అటవీ ఫలసాయాలను కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. నాణ్యమైన అటవీ ఫలసాయాలను గిరిజన రైతుల ఇళ్లకు వచ్చి కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. పార్వతీపురం జీసీసీ మేనేజర్ సాంబశివ రావు, అకౌంటెంట్ బేబీరాణి తదితరులు పాల్గొన్నారు.

కారు బోల్తా.. తప్పిన ప్రమాదం

● బీజేపీ జిల్లా అధ్యక్షుడికి స్వల్ప గాయాలు



తోటపల్లి సమీపంలో బోల్తా పడిన కారు

గరుగుబిల్లి, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు ప్రమాదం నుంచి బయట పడ్డారు. ఆదివారం కురుపాంలోని శుభకార్యానికి వెళ్లి తిరిగొస్తున్న సమయంలో తోటపల్లి ప్రధాన రహదారి మార్గంలో విద్యుత్ స్తంభాన్ని ఆయన కారు ఢీకొట్టి పక్కనే ఉన్న తుప్పల్లోకి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీనివాసరావుకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రాణాపాయం నుంచి బయటపడడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. ఫోన్‌లో సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన అక్కడకు చేరుకుని ఆయన్ని పార్వతీపురం జిల్లాకేంద్రాసుపత్రికి తరలించారు.

బాధిత మహిళకు న్యాయం చేయాలి

జియ్యమ్మవలస, నవంబరు30(ఆంధ్రజ్యోతి):సాలూరు నియోజకవర్గంలో మంత్రి అనధికార పీఏ వేధింపులకు గురిచేస్తున్నట్లు ఫిర్యాదు చేసిన బాధితురాలికి న్యాయం చేయాలని మాజీ ఉప ముఖ్యమంత్రి పాముల పుష్పశ్రీవాణి డిమాండ్ చేశారు. ఆదివారం చినమేరంగిలోని తన నివాసంలో విలేఖరులతో మాట్లాడారు. దీనిపై మంత్రి స్పందించి పారదర్శకంగా దర్యాప్తు జరిగేలా చూడాలన్నారు. బాధ్యులకు శిక్ష పడేలా చూడాలని లేకుంటే బాధిత మహిళ తరపున నిలబడి న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

గరుగుబిల్లి, నవంబరు30(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం 'చదవడం మాకిష్టం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖా గ్రంథాలయం నిర్వాహకులు నల్ల మధుసూదనరావు మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుపై ఆసక్తి కలిగించడంతో పాటు ఆటల పోటీలు నిర్వహించామన్నారు. నిరుద్యోగులు, విద్యార్థులకు ఉపయోగపడే పలు రకాల పుస్తకాలు అందుబాటులో ఉంచామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు సీతంపేట ఐటీడీఏలో పీజీఆర్ఎస్

సీతంపేట రూరల్, నవంబరు30(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించనున్నట్లు ఐటీడీఏ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యలపై అర్జీలు అందించేందుకు గిరిజనులు గ్రీవెన్స్‌కు రావాలని కోరారు.

పాటల పోటీకి విశేష స్పందన

రాయగడ: స్పందన సాహితీ సాంస్కృతిక సంస్థ 30 వసంతాల వేడుకల్లో భాగంగా ఆదివారం ఆ సంస్థ కార్యాలయంలో నిర్వహించిన పాటల పోటీకి విశేష స్పందన లభించింది. సీనియర్, జూనియర్ విభా గాల్లో నిర్వహించిన ఈ పోటీల్లో మొత్తం 37 మంది గాయకులు పాల్గొన్నారు. న్యాయ నిర్ణేతలుగా పార్వతీపురానికి చెందిన ప్రముఖ గాయకులు రమణపాత్రో, శాంతమూర్తి, స్థానిక గాయకుడు రాజకుమార్ వ్యవ హరించారు. సీనియర్ విభాగంలో బి.గౌరిశంకరరావు, పి.కల్యాణి, జి.నాగేశ్వ రరావు విజేతలుగా నిలిచారు. మోహన్‌దాస్ పట్నాయక్, ఎల్.జయ లక్ష్మీలు ప్రోత్సాహక బహుమతులకు ఎంపికయ్యారు. జూనియర్ విభా గంలో శుభశంకర్ ప్రధాన్, ఆకాశ్‌రంజన్ పాఢి , శ్రేయశ్రీ గెలుపొందారు. హాసిని పాత్ర, ముస్కాన్ దత్తాలు ప్రోత్సాహక బహుమతులకు ఎంపికయ్యారు. వారికి ఈ నెల 7న బహుమతులు అందజేస్తామని సంస్థ అధ్యక్షుడు గుడ్ల గౌరిశంకరప్రసాద్ తెలిపారు.



వేదికపై అధ్యక్షులు, న్యాయనిర్ణేతలు